
వర ప్రదాయిని పైడిమాంబ



పైడిమాంబ నిజరూపం



ఉత్సవాలకు సిద్ధమవుతున్న ఆలయం

- కంచరపాలెం ఆర్పీ పేట గ్రామదేవత మహోత్సవాలకు వేళాయె..
- 10న తొలేళ్ల సంబరం, 11న ప్రధాన జాతర
- ప్రత్యేక ఏర్పాట్లలో ఉత్సవ కమిటీ సభ్యులు
- దూర ప్రాంతాల నుంచి తరలిరానున్న భక్తులు



ముస్తాబవుతున్న అమ్మవారి ప్రతిమలు

కంచరపాలెం: భక్తుల పాలిట కొంగుబంగారంగా.. కోరిన వరాలిచ్చే కల్పవల్లిగా.. సంతానలక్ష్మిగా కంచరపాలెం పైడిమాంబ అమ్మవారు విరాజిల్లుతున్నారు. ఎన్నో ఏళ్లుగా అమ్మవారి దీవెన కోసం వేలాది మంది భక్తులు తరలి వస్తున్నారు. రామ్మూర్తిపంతులుపేట ప్రాంత ప్రజలు తమ ఇలవేల్పుగా, గ్రామదేవతగా పైడిమాంబను కొలుస్తారు. భక్తిశ్రద్ధలతో పూజిస్తే కోరికలు నెరవేరుతాయని ప్రగాఢ విశ్వాసం. ఇంతటి విశిష్ట చరిత్ర గల పైడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 10వ తేదీ సోమవారం తొలేళ్ల సంబరం, 11వ తేదీ మంగళవారం ప్రధాన జాతర, 18న మారువారం పండగ, భారీ అన్నదాన కార్యక్రమాలు అత్యంత ఘనంగా ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆర్పీ పేటలోని ఆలయాన్ని, పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అమ్మవారి ప్రతిమలకు మెరుగులద్దుతున్నారు.

ఇదీ ఆలయ చరిత్ర..

ఇక్కడున్న పూర్వీకులు వ్యాపారాల నిమిత్తం తగరపువలసలో కొలువైన పోలిపిల్లి పైడిమాంబ జాతరకు రామూర్తిపంతులుపేట నుంచి ఎండ్ల బళ్లపై వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో భీమరశెట్టి గంగన్న అనే వ్యక్తి బండిని మార్గం మధ్యలో ఓ మహిళా మూర్తి ఆపి ఎక్కి కూర్చొంది. ఆమె విశ్వరూపం చూసిన ఆ వ్యక్తి మూర్ఛతో పడిపోయాడు. ఇక్కడికి చేరుకున్న ఆ బండిలో దేవతామూర్తి విగ్రహం ప్రత్యక్షమైంది. దీంతో ఊరి చివరను వేపచెట్టు కింద విగ్రహాన్ని నిలిపారు. ఇక్కడి ప్రజల కష్టాలు తీర్చేందుకు పైడిమాంబ అమ్మవారు 131 ఏళ్ల క్రితం ఈ ప్రాంతంలో ఓ చెట్టు కింద వెలిశారు. అప్పట్లో ఈ ప్రాంతమంతా సున్నపు బట్టీలతో అడవిలా ఉండేదని గ్రామ పెద్దలు చెబుతుంటారు. ఈ విగ్రహానికి పూజలు జరగకపోవడంతో రామ్మూర్తిపంతులుపేట చుట్టూ ఉన్న ప్రాంతాల్లోని ప్రజలకు కలరా, మశూచి, ఆటలమ్మ వంటి పలు అంటువ్యాధులతో అల్లాడుతున్నప్పుడు అమ్మవారిని పూజించనందుకే ఈ శాపమని భావించారు. అప్పటి నుంచి పైడిమాంబ నిత్య పూజలందుకుంటోంది. ప్రతి మంగళవారం భక్తులకు అన్నదానం, ఏటా మార్చిలో తొలేళ్ల సంబరం, ప్రధాన జాతర, నవ రాత్రి ఉత్సవాలు, ఆఖరు రోజున భారీ అన్నసంతర్పణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తారు.



ఆర్పీ పేట రైల్వే గేటు వద్ద పైడిమాంబ పుట్టబంగారం ఆలయం

మా ఇంటి ఇలవేల్పు



మా తండ్రుల కాలం నుంచి పైడిమాంబ అమ్మవారిని పూజిస్తున్నాం. ప్రతి మంగళవారం అమ్మవారి సన్నిధిలో సేవలు చేస్తుంటాం. ఏ శుభకార్యానికైనా పసుపు కుంకుమ ఇవ్వడం ఆనవాయితీ. చుట్టాల పండగలు చేసుకుంటాం. వేల సంఖ్యలో భక్తులు మాలధరిస్తారు. భవానీ మాల ధారణతో మనసు ప్రశాంతంగా ఉంటుంది.

– కొణతాల పద్మప్రియ, గవర కంచరపాలెం

కష్టాలు తీర్చే తల్లి



నా చిన్నతనం నాటి నుంచి పైడిమాంబను పూజిస్తున్నాను. మా గ్రామ ప్రజలు రోగాల బారిన పడినప్పుడు అమ్మవారు ఇక్కడ వెలిశారని చెబుతుంటారు. మొక్కులు తీర్చుకుంటే మోక్షం లభిస్తుంది. ఏడు గ్రామాల ప్రజలు పుట్టబంగారం అమ్మవారి వద్ద భవానీ మాల ధరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నాం.

– పెంటకోట దేవకి, రామ్మూర్తిపంతులుపేట

కొలిస్తే కోర్కెలు నెరవేరుతాయి



భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. అందుకే గ్రామ ప్రజల ఇలవేల్పుగా అమ్మవారు విరాజిల్లుతోంది. ఏటా నిర్వహించే ఉత్సవాలకు గ్రామ కమిటీ సభ్యుల నేతృత్వంలో ఏర్పాట్లు చేస్తున్నాం. అమ్మవారి ప్రతిమలు తెచ్చే భక్తులకు, నీలబిందెలతో అమ్మవారికి జలాభిషేకం చేసే మహిళా భక్తులకు లక్కీ డ్రా తీసి అమ్మవారి ముద్ర కలిగిన 60 వెండి నాణేలు అందించనున్నాం.

– కొణతాల గోవిందరాజు, గ్రామాధ్యక్షుడు, ఆర్పీ పేట

మర్యాదపూర్వక కలయిక



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసిన అనీల్‌కుమార్ తదితరులు

మల్కాపురం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాయపురెడ్డి అనీల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలోని క్యాంప్ కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి, 60వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ పి.వి.సురేష్ సమక్షంలో జగన్‌ను కలిసి మాట్లాడారు. విశాఖ పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా అడుగులు వేస్తున్నామని, పలు పరిశ్రమల్లో కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వసతులు, పనికి తగ్గ వేతనాలను చెల్లించడం లేదని మొదలగు సమస్యలను వైఎస్ జగన్ దృష్టికి అనీల్‌కుమార్ తీసుకెళ్లారు. పలు జిల్లాల వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు పాల్గొన్నారు. కార్యక్రమ అనంతరం ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మల్కాపురం : ఐఎన్ఎస్ డేగా వద్ద పొదలలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఐఎన్ఎస్ డేగాకు సమీపంలోని సేవా మార్గానికి అనుకుని ఉన్న పొదలలో సుమారు 45 సంవత్సరాల వయసు గల ఒక వ్యక్తి మృతదేహాన్ని అక్కడ పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులు గురువారం ఉదయం గుర్తించారు. మృతదేహం పొంగి ఉండడంతోపాటు, అతని శరీరంపై గాయాలు లేకపోవడాన్ని పోలీసులు గుర్తించారు. డేగాకు సమీపాన గల లారీలు నిలిపే స్థలం వద్దకు వెళ్లి డ్రైవర్లు, క్లీనర్లను విచారించినప్పటికీ వివరాలు తెలియలేదు.

క్లుప్తంగా

'ఈ-శ్రమ్' కార్డుల నమోదు



గోపాలపట్నం రైతుబజారులో ఈ-శ్రమ్ కార్డులు నమోదు చేస్తున్న సిబ్బంది

గోపాలపట్నం: గోపాలపట్నం రైతుబజారులో గురువారం ఈ-శ్రమ్ కార్డులపై కలాసీలు, కూలీలకు అవగాహన కల్పిస్తూ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్డుల ద్వారా ఏవిధమైన లబ్ధి పొందుతారో వీరికి వివరించారు. ఈ-శ్రమ్ కార్డు ఉంటే రూ.2 లక్షల ప్రమాద బీమాతోపాటు పలు రకాల ప్రభుత్వ పథకాలు అందుతాయని సిబ్బంది తెలిపారు. దీంతో అధిక సంఖ్యలో కార్మికులు, కలాసీలు ఈ-శ్రమ్ కార్డులు నమోదు చేసుకునేందుకు క్యూ కట్టారు. వారి ఆసక్తిని బట్టి నమోదు కార్యక్రమం చేపడతామని రైతుబజారు ఈవో ప్రసాద్ తెలిపారు.

తొలితరం నటి కృష్ణవేణికి ఘన నివాళి



కృష్ణవేణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాసేవా పీఠం సభ్యులు

గోపాలపట్నం: సినీ రంగంలో తొలితరం నటి కృష్ణవేణికి గోపాలపట్నం కళాసేవా పీఠం సభ్యులు గురువారం ఘనంగా నివాళులర్పించారు. గోపాలపట్నం కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పీఠం అధ్యక్షుడు గొరపల్లి బంగారాజు, ప్రధాన కార్యదర్శి కొంతం నూకరాజేశ్వరరావు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణవేణి బహుముఖ ప్రజ్ఞాశాలని కొనియాడారు. కథానాయికగా, స్టూడియో నిర్మాతగా, గాయనిగా అసాధారణ ప్రతిభ చూపారన్నారు. కళాసేవా పీఠం వ్యవస్థాపకుడు నందవరపు సోములు మాట్లాడుతూ సినీ పరిశ్రమలో కృష్ణవేణి ప్రత్యేక స్థానం సంపాదించారన్నారు. కార్యక్రమంలో పీఠం గౌరవ అధ్యక్షుడు చందు సుబ్బారావు, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, ఆర్గనైజర్ కె.వెంకటరావు, టి.రామారావు, మిద్ది అప్పారావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పందుల సంచారంతో దుర్వాసన



గుంపుగా ఉన్న పందులు

మల్కాపురం : జీవీఎంసీ 59వ వార్డు హిమచల్ నగర్ వద్ద గల ఆర్ఆర్ ఎన్‌క్లూజివ్ అపార్ట్‌మెంట్ పక్కన గల ఖాళీ ప్రదేశంలో పదుల కొద్దీ పందులు సంచరించడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడి కాలువల్లోని వ్యర్థాలు తింటూ సమీపంలోని నివాసాల్లోకి చొరబడుతున్నాయని, వాహనదారుల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నాయని వాపోతున్నారు. ఈ సమస్యపై ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పరిష్కరించడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి పందుల సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణపై సీఎం స్పందించాలి

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పందించాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత 157 రోజుల నుంచి ఆస్పత్రి వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్నామని, దీనిపై వెంటనే ముఖ్యమంత్రి స్పందించి ప్రైవేటీకరణను అడ్డుకోవాలని కోరారు. దీక్షలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్ టెండరు పేరుతో ఎవరొచ్చినా అడ్డుకోవాలని, తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సుమారు 40 వేల మంది ప్రస్తుత, రిటైర్డ్ పోర్టు, సీఐఎస్ఎఫ్, డీఎల్బీ ఉద్యోగుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేటు వారి చేతుల్లో పెట్టడం సరికాదన్నారు. పోర్టు వద్ద ఉన్న రిజర్వు నిధులతో ఆస్పత్రిని ఆధునికీకరించి నిర్వహించాలని కోరారు. అలా కాకుంటే తమ పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దీక్షలో బి.జగన్, జె.సత్యనారాయణ, గణేష్, నాయుడు, రాజగోపాల్, కేఎస్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రూ.47.65 లక్షలతో మౌలిక వసతులు



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో రూ.47.65 లక్షలతో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు కార్పొరేటర్ బొమ్మిడి రమణ తెలిపారు. గాంధీనగర్‌లో డ్రైనేజీ నిర్మాణ పనులకు గురువారం ఆయన స్థానికులతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యపై కాలనీ వాసుల విన్నపం మేరకు జీవీఎంసీ ద్వారా నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు.

బుచ్చిరాజుపాలెం మెయిన్ రోడ్డు నుంచి గాంధీనగర్ రైల్వే పట్టాల వరకు వరద నీరు కిందకు పోయేందుకు వీలుగా జీవీఎంసీ వార్డు అభివృద్ధి నిదులు మంజూరు చేయించినట్లు తెలిపారు. స్థానికులు, రెడ్డివీధి రామ బాలభక్త సంఘం సభ్యులు కాలనీల్లో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. సామాజిక భవనం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరగా.. పబ్లిక్ వర్క్స్ అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు తయారు చేయవలసిందిగా సూచించారు. కార్యక్రమంలో పబ్లిక్ వర్క్స్ ఏఈ వెంకటలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, యేలేటి సోమేశ్, గాంధీనగర్ అధ్యక్షుడు దాసరి కృష్ణ, కార్యదర్శి కొండల రావు సత్యనారాయణ ప్రసాద్, కెల్లా అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో నేరాల నియంత్రణ



సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద వీడియో తిలకిస్తున్న స్థానికులు

గోపాలపట్నం : నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని నేర విభాగం పోలీసులు సూచిస్తున్నారు. ఈ మేరకు సింహాచలం రైల్వే స్టేషన్‌లో గురువారం అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో నేరాలు ఎలా జరుగుతున్నాయో వివరిస్తూ వీడియోలను ప్రత్యేక వాహనం మీద స్క్రీన్‌పై ప్రదర్శించారు. వెస్ట్ సబ్ డివిజన్ సీఐ నమ్మకాయల శ్రీనివాసరావు పర్యవేక్షణలో గోపాలపట్నం ఎస్ఐ జి.తేజేశ్వరరావు పర్యవేక్షణలో వీడియో ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌సీ కన్నంనాయుడు మాట్లాడుతూ అప్రమత్తతతోనే నేరాలను నియంత్రించవచ్చని తెలిపారు. వీధుల్లో అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే గమనించాలని సూచించారు. చైన్ స్నాచింగ్‌కు గురి కాకుండా ఉండేందుకు మహిళలు విలువైన వస్తువులు వేసుకుని ఒంటరిగా వెళ్లొద్దని సూచించారు. స్వగ్రామాలకు వెళ్లే వారు పోలీసులకు సమాచారమివ్వాలని, ఇళ్లల్లో ఎల్‌హెచ్ఎంఎస్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐలో సాయుధ దళాలకు ముగిసిన శిక్షణ



సాయుధ దళాల సిబ్బందికి సర్టిఫికెట్ అందజేస్తున్న అధికారులు

ఆరిలోవ: విశాఖ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఐ)లో భారత సాయుధ దళాలకు చెందిన ప్రీ రిటైర్మెంట్ కోర్సు విద్యార్థులకు శిక్షణ నిర్వహించారు. డిప్లమో ఇన్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కోర్సులో 24 వారాల పాటు ఇచ్చిన శిక్షణ గురువారంతో ముగిసింది. నగరంలో ఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం అడ్మిన్ కల్నల్ అమితాబ్ కుమార్ ముఖ్యఅతిథిగా, గౌరవ అతిథులుగా ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ, డిఫెన్స్ జాయింట్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ప్రోగ్రాం విద్యా సలహాదారు డాక్టర్ ఉజ్వల కుమార్ ఘటక్ పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం కోర్సుకు సంబంధించిన ఉపయోగాలు, నైపుణ్యం గురించి ఎఫ్‌సీఐ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ వివరించారు. పర్యాటక కార్యకలాపాలు, ఆతిథ్య నిర్వహణ, కస్టమర్ సేవలు, ఈవెంట్ ప్లానింగ్ తదితరవాటి గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌స్ట్రక్టర్లు పార్థసారథి, కుముదిని, లీలాప్రియదర్శిని, జాషువా, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం ఐక్య ఉద్యమాలు



ర్యాలీలో పాల్గొన్న మహిళలు

గాజువాక : మహిళలు తమ హక్కుల కోసం ఐక్య ఉద్యమాలను సాగించాల్సిన అవసరం ఉందని ఐద్వా గాజువాక జోన్ అధ్యక్షురాలు కె.సంతోషం అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గాజువాకలో భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళలపై లైంగిక దాడులు ఖండించాలని, వినోదం కోసం మహిళలను ఆట వస్తువుగా చూడొద్దని, మహిళా కార్మికులపై పని ప్రదేశాలలో లైంగిక వేధింపులు ఆపాలని, నిర్భయ చట్టాలను మరింత కఠినం చేయాలని, చట్ట సభల్లో రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నినదించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ మహిళలకు ఇప్పుడున్న కొద్దిపాటి హక్కులు కూడా పోరాటాలతోనే సంక్రమించాయన్నారు. దేశాభివృద్ధిలో మహిళలు కూడా సమాన భాగస్వామ్యం కలిగి ఉన్నారన్నారు. అయినప్పటికీ మహిళలను ఇంకా ద్వితీయశ్రేణి పౌరులుగా చూసే పరిస్థితులున్నాయన్నారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించడంలోను, సమాన పనికి సమాన వేతనం అందించడంలోను ఇంకా వివక్ష పాటిస్తున్నారన్నారు. ఈ సమస్యలపై మహిళలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు జి.లక్ష్మి, చిన్నమ్మలు, సాయి, సరస్వతి, సీఐటీయూ, డీవైఎఫ్ఐ నాయకులు ఎం.రాంబాబు, లోకేష్, గొలగాని అప్పారావు, శ్రీదేవి, పి.యశోధరాణి, స్వర్ణలత, వేణు పాల్గొన్నారు.

జోన్ - 5లో నీటి దొంగలు..!

- సొంత వ్యాపారాలకు జీవీఎంసీ తాగునీరు
- ట్యాంకర్లతో రాత్రి వేళ దర్జాగా చోరీ
- చోద్యం చూస్తున్న అధికారులు



జీవీఎంసీ పైపు నుంచి నీటిని ట్యాంకర్‌లో నింపుతున్న దృశ్యం

విశాఖ విద్య : ఇప్పటి వరకూ సమాజంలో డబ్బులు దొంగలించే వారిని చూశాం.. వస్తువులు ఎత్తుకుపోయేవాళ్లనూ చూశాం.. కానీ కొందరు స్వార్థపరులు సొంత వ్యాపారాల కోసం రాత్రివేళల్లో తాగునీటిని దోచుకుపోతున్నారు. ఆశ్చర్యంగానే ఉన్నా ఇదే నిజం. నగరంలోని జోన్ – 5 పరిధిలో తాగునీటిని కొంతమంది తమ వ్యాపార అవసరాలకు దొంగచాటుగా ట్యాంకర్లతో దోచుకుపోతున్నారు. జీవీఎంసీ 52వ వార్డు పరిధి మర్రిపాలెం గ్రీన్‌బెల్ట్ పార్కుకు ఎదురుగా గురువారం రాత్రి బయటపడిన వ్యవహారంతో ఇక్కడ నీళ్లతో వ్యాపారం ఏ రీతిన సాగుతుందో తేటతెల్లమైంది. ఎన్ఏడీ కేంద్రంగా హోటళ్లు నిర్వహించే కొంతమంది రాత్రి వేళ జీవీఎంసీ తాగునీటిని ట్యాంకర్లతో తరలించుకుపోతున్నారు. మర్రిపాలెం గ్రీన్ బెల్ట్ పార్కులో ట్యాంకర్లకు తాగునీటిని నింపేందుకు నగర పాలక సంస్థ అధికారులు ఏర్పాట్లు చేశారు. నగరంలో అవసరమైన చోట్లకు ట్యాంకర్లు ద్వారా తాగునీటి సరఫరా చేసేందుకని 'ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్'ను ఇక్కడ ఏర్పాటు చేశారు. జీవీఎంసీ ఉద్యాన వన విభాగం పర్యవేక్షణలో ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్ నిర్వహిస్తున్నారు. తాగునీటి అవసరాలతోపాటు, నగరంలోని రహదారి మధ్యలో ఉన్న ఉద్యానవనాలకు నీటిని ఇక్కడి నుంచి ట్యాంకర్లు ద్వారా సరఫరా చేస్తున్నారు.

మామూళ్ల మత్తులో అధికారులు

మర్రిపాలెం గ్రీన్ బెల్ట్ పార్కులో ఏర్పాటు చేసిన ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్ నుంచి రాత్రి వేళల్లో సమీపాన ఉన్న హోటళ్ల నిర్వాహకులు, మరికొంత మంది వ్యాపారులు తమ వ్యాపార అవసరాల కోసమని ట్యాంకర్లతో తాగునీటిని దోచుకుపోతున్నారు. ఇలా రోజూ రాత్రి వేళలో ఇక్కడ ఇదే తంతు జరుగుతున్నా సంబంధిత జీవీఎంసీ అధికారులు చోద్యం చూస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. మర్రిపాలెంలో ఉన్న ఓ హోటల్ నిర్వాహకులు చాలా కాలంగా ఇదే రీతిన ట్యాంకర్లతో జీవీఎంసీ తాగునీటిని తమ వ్యాపారాల కోసమని తరలిస్తున్నారు. గ్రీన్ బెల్ట్‌లో వాకింగ్ కోసమని వెళ్తున్న వారు దీనిపై ప్రశ్నిస్తున్నా అధికారుల అండదండలతో నీటి తరలింపు అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది. జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం అధికారులకు నెల వారీ మామూళ్లు ముట్టజెపుతూ, ఇక్కడి వ్యాపారాలు ట్యాంకర్లతో ఇష్టానుసారంగా నీటిని తరలిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇలాంటి చర్యలతో శివారు కాలనీల ప్రజానీకానికి తాగునీరు సవ్యంగా అందడం లేదు. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు మర్రిపాలెం గ్రీన్ బెల్ట్ పార్కు వద్ద జరుగుతోన్న 'నీటి వ్యాపారం'పై దృష్టి సారించి, అనుమతుల్లేకుండా ట్యాంకర్లుతో నీటిని దోచుకుపోతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తక్షణమే చర్యలు తీసుకోవాలి

నగర వాసులకు తాగునీరు సవ్యంగా సరఫరా చేసేందుకు ఆటంకాలు సృష్టిస్తున్న ఇలాంటి వ్యవహారాలపై జీవీఎంసీ అధికారులు తక్షణమే దృష్టి పెట్టాలి. ట్యాంకర్లు ద్వారా రాత్రి వేళల్లో తాగునీటిని తరలిస్తున్న వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలి. ప్రజలకు అవసరమైనంత తాగునీరు సక్రమంగా సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలి.

– జియ్యాని శ్రీధర్, డిప్యూటీ మేయర్

క్యాన్సర్‌పై శిబిరం రేపు

గోపాలపట్నం : గోపాలపట్నం బెహరా ఆస్పత్రిలో క్యాన్సర్‌పై ఉచిత అవగాహన శిబిరం శనివారం నిర్వహించనున్నామని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ బెహరా రవితేజ తెలిపారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 7094529994, 7094529995లో సంప్రదించాలని కోరారు.

ఉపాధి కోర్సులో ఉచిత శిక్షణ

మురళీనగర్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీలోని స్కిల్ హబ్‌లో నిరుద్యోగ యువతకు ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులో మూడు నెలల స్వల్పకాల ఉచిత శిక్షణకు పదో తరగతి, ఆపై అర్హత కలిగిన 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన యువకులు ఈ నెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు డి.రామకృష్ణను 9948768778లో సంప్రదించాలని కోరారు.

ఎరుకుమాంబ సన్నిధిలో అన్నసమారాధన



అన్నప్రసాదం వడ్డిస్తున్న ఆలయ ప్రతినిధులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానంలో మహా శివరాత్రి మారు వారాన్ని పురస్కరించుకుని గురువారం అన్నసమారాధన చేశారు. దేవస్థానం ఈవో రమాభాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ చైర్మన్, 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని బుజ్జి, దేవస్థానం సిబ్బంది సత్యనారాయణరాజు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి



ధర్నాలో హమాలీలు, ముఠా కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార : పౌర సరఫరాల శాఖ హమాలీలను రాష్ట్ర ప్రభుత్వం 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ హమాలీల యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మన్మథరావు మాట్లాడుతూ పౌర సరఫరాల వ్యవస్థ ప్రారంభం నుంచి పని చేస్తున్నప్పటికీ హమాలీల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఇప్పటికైనా వీరి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హమాలీలు అనేక ప్రమాదాలకు గురవుతున్నారని, వారికి కనీసం వైద్యం కూడా లభించడం లేదన్నారు. వీరికి తక్షణమే ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. పీఎఫ్ ద్వారా చనిపోయిన వారి కుటుంబాలకు పెన్షన్ సౌకర్యం అమలు చేసి, 60 సంవత్సరాల నుంచి కార్మికులందరికీ పీఎఫ్ సొమ్ము అందజేసి పెన్షన్ అందించాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పడాల రమణ, సీహెచ్ కాసుబాబు, సీహెచ్ గురుమూర్తి, హమాలీలు, ముఠా కార్మికులు పాల్గొన్నారు.